**COMMUNIST PARTY OF INDIA (MARXIST)**

**ANDHRA PRADESH COMMITTEE**

H.No. 27-28-12, CPI(M) State Committee Office
Yamalavari Street, Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202, Fax: 0866 - 2577203
E-mail: cpimap@gmail.com

ప్రచురణార్థం/ప్రసారార్థం : విజయవాడ,

తేది : 25 ఆగస్టు, 2022.

## అరెస్టులకు ఖండన

కార్మికుల హక్కులను కాలరాసే లేబర్‌కోడ్‌లకు వ్యతిరేకంగా తిరుపతిలో కార్మిక సంఘాలు తలపెట్టిన నిరసన కార్యక్రమాన్ని అడ్డుకొని అరెస్టు చేయడాన్ని సిపిఐ(యం) రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తున్నది. కార్మికులకు హాని చేసే లేబర్ కోడ్‌లను తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నది. అరెస్టు చేసిన నాయకులను, కార్మిక సంఘాల నేతలను తక్షణం విడుదల చేయాలని కోరుతున్నది.

కార్మికులు అనేక సంవత్సరాలుగా పోరాడి సాధించుకున్న చట్టాలను రద్దు చేసి ఆ స్థానంలో పెట్టుబడిదారులకు అనుకూలమైన నాలుగు కోడ్‌లుగా మార్చి అమలు చేయడానికి కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాల కార్మిక శాఖ మంత్రులతో నేడు, రేపు (ఆగస్టు 25, 26) తిరుపతిలో భేటీ నిర్వహిస్తున్నది. ఈ లేబర్ కోడ్‌లు అమలు జరిగితే కార్మికులు తాము సంఘాలు ఏర్పాటు చేసుకునే హక్కును, కనీస వేతనాన్ని పొందే హక్కును, సమ్మె హక్కును కోల్పోతారు. పనిగంటలు, వారాంతపు సెలవులు, పని ప్రదేశంలో భద్రత మరియు ఆరోగ్యాలకు సంబంధించిన నిబంధనలను నోటిఫికేషన్ ద్వారా నిలుపు చేసే అధికారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఈ లేబర్ కోడ్‌లు కల్పిస్తాయి. ఈపీఎఫ్, ఈఎస్ఐ పథకాలను కేంద్ర ప్రభుత్వం తన నోటిఫికేషన్ ద్వారా మార్చే అధికారం తీసుకున్నది. ఈఎస్ఐ, పిఎఫ్‌లను తమ ఇష్టానుసారం మార్చే అవకాశం కేంద్ర ప్రభుత్వానికి వస్తుంది. పని ప్రదేశంలో ప్రమాదాలు జరిగితే యాజమాన్యాలకు సంబంధం లేకుండా నిబంధనలు సవరించారు. ఫిక్స్‌డ్ టర్మ్ ఎంప్లాయిమెంట్ పేరుతో పర్మినెంటు ఉద్యోగాలనేవే లేకుండా పోతాయి. కార్మికులకు రక్షణ కల్పించాల్సిన కార్మిక శాఖను కీలుబొమ్మలా మార్చేస్తున్నారు. అత్యంత ప్రమాదకరమైన ఈ కోడ్‌లను అనుమతించకూడదని దేశవ్యాప్తంగా కార్మికులు పోరాడుతున్నారు.

మన రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి తలొగ్గి లేబర్‌కోడ్‌లకు రూల్స్ తయారు చేసి కార్మికుల హక్కులను కాలరాయడానికి పూనుకోవడం గర్హనీయం. ఇటువంటి సమావేశానికి మన రాష్ట్రం ఆతిథ్యమివ్వడం ఆక్షేపణీయం. ఇప్పటికైనా రాష్ట్రప్రభుత్వం కార్మిక సంఘాల అభ్యంతరాలను స్వీకరించి కార్మిక కోడ్ రూల్స్‌ను ఉపసంహరించుకోవాలి.

ఇంత దుర్మార్గమైన లేబర్ కోడ్‌లను తిరుపతిలో జరిగే భేటీలో నిర్ణయించడానికి కేంద్ర ప్రభుత్వం దూకుడుగా వ్యవహరిస్తున్నది. కనీసం పార్లమెంటులో చర్చ పెట్టకుండా, కార్మిక సంఘాల అభిప్రాయాలు కూడా తీసుకోకుండా కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా ఈ లేబర్ కోడ్‌లను రాష్ట్రాలపై రుద్దింది. దీనిని నిరసిస్తూ కార్మిక సంఘాల నేతృత్వంలో నిరసనకు పిలుపిచ్చారు. ఈ సందర్భంగా తిరుపతిలో ర్యాలీ నిర్వహిస్తున్న సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.ఏ.గఫూర్, మాజీ ఎం.పి. పి.మధులతో సహా పలు కార్మిక సంఘాల నేతలపై పోలీసులు విరుచుకుపడి విచక్షణా రహితంగా వందలాది మందిని అరెస్టులు చేశారు. కార్పొరేట్‌లు, పెట్టుబడిదారులకు సాగిలపడేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిస్సిగ్గుగా వ్యవహరించడం గర్హనీయం. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడి లేబర్ కోడ్‌లను తెచ్చే ప్రయత్నాలు ఉపసంహరించుకోవాలని సిపిఐ(యం) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేస్తున్నది.

**(వి.శ్రీనివాసరావు)**
రాష్ట్ర కార్యదర్శి